క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు ఫీడర్లలో మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. శాస్త్రీపురం, కింగ్స్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, హసన్‌నగర్, ఎన్‌పీఏ, సాయిబాబా నగర్, బాబుల్‌రెడ్డినగర్, శివరాంపల్లి ఫీడర్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

అనాథాశ్రమంలో అన్నదానం



చిన్నారులతో బండి ప్రతాప్‌రెడ్డి, ప్రమీలమ్మ కుటుంబ సభ్యులు

రాజేంద్రనగర్: రాష్ట్ర బీజేపీ నాయకుడు, మాజీ కౌన్సిలర్ బండి ప్రతాప్‌రెడ్డి, ప్రమీలమ్మ రెండో వర్ధంతి సందర్భంగా సోమవారం అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి, ప్రమీలమ్మల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనాథాశ్రమాల్లో ఉంటున్న పిల్లలకు అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఝాన్సీ ఉమారెడ్డితో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అవగాహన అవసరం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాహుల్‌గాంధీ

రాజేంద్రనగర్: ప్రస్తుత యాంత్రిక జీవనంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల అవగాన పెంచుకోవాలని జాయ్ ఆసుపత్రి డాక్టర్ రాహుల్‌గాంధీ అన్నారు. సోమవారం ఉదయం హైదర్‌గూడ పార్కు వద్ద అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు వాకింగ్, జాగింగ్, యోగా, వ్యాయామం తప్పనిసరిగా చేయాలన్నారు. తమకు అనుకూలంగా ఉన్న ఏదైనా ఒక వ్యాయామాన్ని తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలన్నారు. యోగా, వాకింగ్, సైకిలింగ్, వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్రజలంతా తమ ఆరోగ్యాలపై శ్రద్ధ వహించి జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించండి సారూ..



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్, బుద్వేల్, చింతల్‌మెట్ బస్తీల్లో గోతులమయంగా మారిన రహదారి కారణంగా ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయా ప్రాంతాల వాసులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ జగన్, ఈఈ అంజయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2020లో బస్తీలో సీసీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరైనా ఇప్పటి వరకు పనులు చేపట్ట లేన్నారు. గోతులమయమైన రోడ్డు కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వాహనదారులు, వృద్ధులు, చిన్నారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేతన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారని త్వరలో టెండర్లు పిలిచి రోడ్డు పనులను నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో చంద్రమౌళి, నాగేష్, వీరాచారి, మల్లేష్, రాందేవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అత్తాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శివరాంపల్లి హెచ్‌పీ పెట్రోల్‌బంక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడన్నారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హైపర్ టెన్షన్.. అనర్థాలకు మూలం







సైలెంట్ కిల్లర్‌గా మానవ శరీరంలోకి ప్రవేశించే హైపర్ టెన్షన్ పలు వ్యాధులకు కారణమవుతుందని జోయో ఆసుపత్రి సీఈవో డాక్టర్ తపాడియా అన్నారు. సోమవారం వరల్డ్ హైపర్ టెన్షన్ డేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు స్థానికులతో కలిసి ఏడు కిలోమీటర్ల మేర సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జోయో సైకిల్ స్టన్ పేరుతో అత్తాపూర్ నుంచి నిర్వహించిన ర్యాలీలో 300 మందికి పైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ తపాడియా మాట్లాడుతూ హైపర్ టెన్షన్ ప్రభావం గుండెపోటు, స్ట్రోక్స్, ఇతర వ్యాధులకు కారణమవుతుందన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో జీవించేందుకు ఎవరికి వారు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. – అత్తాపూర్

గ్రామీణాభివృద్ధికి ప్రతీక తెలంగాణ



కేబీ దొడ్డిలో మహిళా మండలి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని రామంజాపూర్, ననాజీపూర్, కాచారం, సుల్తాన్‌పల్లి, కేబీ దొడ్డి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలు తెలంగాణలో కొనసాగుతున్నాయన్నారు. గ్రామీణాభివృద్ధికి ప్రతీకగా తెలంగాణ నిలుస్తుందన్నారు. ఆయా గ్రామాల్లో సుమారు రూ.2 కోట్లతో భూగర్భ మురుగు కాలువలు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ, మహిళా మండలి భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, వైఎస్ ఎంపీపీ నీలం, జెడ్పీటీసీ తన్వీరాజు, సర్పంచ్‌లు నర్సమ్మ, కల్పన, రాంగోపాల్, డి.ఇస్తారి, ఎంపీటీసీ సభ్యుడు క్రాంతికుమార్, సంగీత, ఎంపీడీఓ వసంతలక్ష్మీ, ఎంపీఓ ఉషాకిరణ్, నాయకులు యాదగిరిరెడ్డి, ప్రభసాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ప్రార్థన దినోత్సవం



ప్రార్థనల్లో పాల్గొన్న రెవరెండ్లు

బండ్లగూడ: గండిపేట్ మండలం, హైదర్షాకోట్ హిమగిరినగర్‌లోని పెనుయేల్ గాస్పల్ చర్చ్‌లో ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నేషనల్ ప్రేయర్ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రార్థనలకు పెనుయేల్ గాస్పెల్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ దీవెన జాషువా అధ్యక్షత వహించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. జాషువా గుమ్మళ్ల మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పెనుయేల్ గాస్పెల్ చర్చ్ సీనియర్ పాస్టర్ జాషువా గుమ్మళ్ల బైబిల్ సందేశాన్ని వినిపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం యేసయ్యను ప్రార్థించాలన్నారు. దేవుని ప్రార్థించినప్పుడు సాధారణమైన వ్యక్తి కూడా దేవుని దీవెనలు అందుకుని అసాధారణమైన వ్యక్తిగా ఎదుగుతాడన్నారు. కార్యక్రమంలో రెవరెండ్‌లు పరంజ్యోతి, స్టీవెన్ సన్ పాల్, సి.హెచ్.జాన్‌మోజెస్, కె.నతానియల్, కె.సుందర్‌పాల్, మనోహరం, గ్లోరీ బాబు, ఏలియాబాబు, రవికుమార్, పాల్ దేవరాజ్, మధు పాల్గొన్నారు.

చెత్త రహిత డివిజన్‌గా అత్తాపూర్



మాట్లాడుతున్న కార్పొరేటర్ మొంద్ర సంగీతగౌరీశంకర్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్‌ను చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మొంద్ర సంగీతగౌరీశంకర్ తెలిపారు. సోమవారం కార్పొరేటర్ కార్యాలయంలో రామ్‌కీ జోనల్ హెడ్ అధికారి సుశాంత్, సర్కిల్ ఇన్‌చార్జి నర్సింహారెడ్డి, రామ్‌కీ వార్డ్ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌కీ సంస్థ డివిజన్ పరిధిలో చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు ఉదయం 4 గంటల నుంచి పనులను ప్రారంభిస్తున్నామని, డివిజన్‌లోని 28 ఓపెన్ పాయింట్ల వద్ద రోజుకు మూడు సార్లు చెత్తను లిఫ్ట్ చేస్తున్నామని, సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలిస్తున్నట్లు రామ్‌కీ జోనల్ హెడ్ అధికారి సుశాంత్ వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి రోజు ఇంటింటికి తిరుగుతూ రామ్‌కీ సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఓపెన్ పాయింట్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి వచ్చిన నేపథ్యంలో చాలా వరకు వాటిని తన సొంత నిధులతో పబ్లిక్ ప్రోగ్రామ్‌లు నిర్వహించి ఆయా ప్రాంతాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిలో మార్పు తీసుకువస్తున్నామన్నారు. అత్తాపూర్ డివిజన్‌ను చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు ముమ్మరం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డ్ ఫీల్డ్ అసిస్టెంట్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్లాట్లు కేటాయించాలని బెదిరిస్తున్నారు’

రాజేంద్రనగర్: కాటేదాన్ టీఎన్‌జీఓస్ కాలనీలో పది ప్లాట్లు కేటాయించాలంటూ సొసైటీకి సంబంధం లేని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారని కాటేదాన్ టీఎన్‌జీఓస్ హౌసిగ్ సొసైటీ ప్రతినిధులు ఆరోపించారు. సోమవారం కాటేదాన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎన్‌జీఓస్ హౌసింగ్ సొసైటీకి చెందిన సాయినాథ్‌గౌడ్ మాట్లాడుతూ సొసైటీతో సంబంధంలేని శ్రీనివాస్‌రాజు, అశ్విని అనే వ్యక్తులు గత ఆరు నెలలుగా టీఎన్‌జీఓస్ కాలనీలో తమకు ప్లాట్లు కేటాయించాలంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు తెలుసని తమకు ప్లాట్లు కేటాయించకపోతే సంబంధం లేని కేసుల్లో ఇరికించి అరెస్టు చేయిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డింగ్‌లను వినిపించారు. దీనిపై తాము మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. 2022 ఆగస్టులో కాటేదాన్ టీఎన్‌జీఓస్ హౌసింగ్ సొసైటీలో ఉద్యోగులకు ఇంటి స్థలాలను సొసైటీ అధ్యక్షులు అమృతరావు ఆదేశాల మేరకు కార్యదర్శిగా ఉన్న వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. అయితే అమృతరావు సంతకాలు తీసుకుని శ్రీనివాస్‌రాజు అనే వ్యక్తి సొసైటీ సభ్యులపై ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కాటేదాన్ టీఎన్‌జీఓస్ హౌజింగ్ సొసైటీకి ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారిపై రాజేంద్రనగర్ డీసీపీ, ఏసీపీలను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. శ్రీనివాసరాజుకు పండుగ రమేష్‌రెడ్డి, నాగప్రకాష్ అనే వ్యక్తులు మద్దతు ఇస్తున్నారని, తమకు డీజీపీ, సీపీ తెలుసునని బెదిరిస్తున్నారని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరారు.

‘మా స్థలం ఎవరూ కబ్జా చేయలేదు’



మణికొండ: ప్రభుత్వం తమకు ఇచ్చిన స్థలంలో నిర్మాణాలు చేపడితే కొందరు వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తూ తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మాజీ సైనిక ఉద్యోగులు అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విశ్రాంత సైనిక ఉద్యోగుల సంక్షేమం కోసం అప్పటి ప్రభుత్వం నార్సింగి గ్రామంలోని సర్వే నెంబర్ 205/1లో ఇళ్ల స్థలాలు కేటాయించిందన్నారు. సదరు స్థలంలో కొందరు తమ ప్లాట్లను అమ్ముకోగా మిగిలిన 18 మంది ఇళ్ల స్థలాల యజమానులు ఇటీవల నార్సింగి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులను కలిసి తమకు ఇంటి నెంబర్లు కేటాయించాలని కోరుతూ దరఖాస్తులు అందజేశామన్నారు. అయితే ఇటీవల ఓ విలేకరి తమను డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడమేగాక తమను స్థానిక కౌన్సిలర్ వేధిస్తున్నాడంటూ తప్పుడు వార్తలు ప్రచురించాడన్నారు. తమ స్థలాన్ని ఎవరూ కబ్జా చేయలేదని, మాజీ సైనికులమైన తమకు స్థలాన్ని కాపాడుకోవడం తెలుసన్నారు. అకారణంగా తమను రోడ్డుకు ఈడ్చే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. సోమవారం సదరు విలేకరిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పార్కుల్లో మెరుగైన సౌకర్యాలు



హుడాకాలనీలో వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న చైర్మన్ నరేందర్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని పార్కుల్లో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం ఆయన వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డితో కలిసి పాషా కాలనీ, హుడా కాలనీ పార్కుల్లో వాటర్ కూలర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని పార్కులన్నింటినీ దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు అభివృద్ధి చేసి పార్కులకు ప్రజల నుంచి విశేష ఆదరణ అలభిస్తుందన్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు సేద తీరేందుకు పార్కులకు అధికంగా వస్తున్నారని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, కౌన్సిలర్లు కె.లక్ష్మీనారాయణ, కో ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు బి.శ్రీరాములు, సి.బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేటు మూసి వేయరాదు

మున్సిపల్ సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ సుష్మ

శంషాబాద్: పట్టణంలోని సిద్ధాంతి రైల్వే గేటు మూసివేయడం తగదని పట్టణ పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మునిసిపల్ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అధ్యక్షతన సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల రైల్వేశాఖ సిద్ధాంతి వద్ద ఉన్న రైల్వే క్రాసింగ్ మూసివేతకు నిర్ణయం తీసుకున్నట్లు సమావేశంలో చర్చకు రావడంతో రైల్వేశాఖ తీరుపై పాలకవర్గ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టణానికి ఇరువైపుల ఉన్న బస్తీల అనుసంధాన కోల్పోవడంతో పాటు ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే తప్ప ఇందుకు అంగీకరించేది లేదన్నారు. రైలేగేటు మూసివేయరాదని తీర్మానించారు. దీంతో పాటు ఉందానగర్ రైల్వేస్టేషన్ పేరు శంషాబాద్‌గా మార్చాలని తీర్మాణం చేశారు. వీటితో పాటు ఆయా బస్తీల్లో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్లు, కౌన్సిలర్లు అజయ్, జహంగీర్, సంజయ్‌యాదవ్, గీత,శ్రీకాంత్‌యాదవ్, రేఖ, అమృత, భారతమ్మ, వై.కుమార్, లక్ష్మీ పాల్గొన్నారు.

ఐకేపీ సిబ్బంది ముందస్తు అరెస్టు

శంషాబాద్ రూరల్: హైదరాబాద్‌లో జరగనున్న ధర్నాకు తరలివెళుతున్న ఐకేపీ సిబ్బందిని శంషాబాద్ పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలానికి చెందిన ఇందిరా క్రాంతి పథకం విలేజ్ ఆర్గనైజర్ అసిస్టెంట్స్ తమ డిమాండ్ల సాధన కోసం సోమవారం హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు బయలుదేరారు. దీనిపై సమాచారం అందడంతో శంషాబాద్ పోలీసులు పెద్దషాపూర్ చౌరస్తా వద్ద వారిని అడ్డుకున్నారు. ఐకేపీ సిబ్బందిని ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.



పోలీసుల అదుపులో ఐకేపీ సిబ్బంది

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించినప్పుడే వారు ఆదరిస్తారని, అందుకు అనుగుణంగా కౌన్సిలర్లు, అధికారులు చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. సోమవారం చైర్మన్ అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రూ.11.38 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు.

నిధుల కేటాయింపు ఇలా..

పలు వార్డుల్లో రూ.7.50 లక్షలతో డ్రైనేజీ పైపుల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, టాయిలెట్ల నిర్మాణం, చెత్త డబ్బాల ఏర్పాటుకు రూ. 1.07కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించారు. పలు పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు, పిల్లల క్రీడా పరికరాల ఏర్పాటుకు రూ.30 లక్షలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు రూ.15 లక్షలు, 18వ వార్డు కార్యాలయం నిర్మాణానికి రూ. 50 లక్షలు, విద్యుత్ పనుల నిర్వహణ, స్తంభాల ఏర్పాటుకు రూ. 20 లక్షలు, 18వ వార్డులోని ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.30 లక్షలు, జలమండలి వారికి పైప్ లైన్లు, సరఫరా నిర్వహణకు రూ.2.43 కోట్లు, పలు వార్డుల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు కోల్డ్ రూఫ్ పాలసీలో భాగంగా పెయింట్ వేయించేందుకు రూ. 10 లక్షలు, వీధి కుక్కల స్టెరిలైజేషన్‌కు రూ. 20లక్షలు, వాహనాల నిర్వహణ, టైర్ల కొనుగోలు, స్టేషనరీ, సీసీ కెమరాల ఏర్పాటు , వాకిటాకీల కొనుగోలుకు రూ. 42 లక్షలు వెచ్చించనున్నట్లు తెలిపారు. 13, 9వ వార్డుల్లో నాలుగు పార్కులకు రాణి రుద్రమదేవి, అల్లూరి సీతారామరాజు, చత్రపతి శివాజీ, సర్దార్ వల్లబాయి పటేల్ పేర్లను ఖరారు చేశారు. మంచినీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని జీఎం రవీందర్‌రెడ్డిని కోరారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కౌన్సిలర్లతో కమిటీలు వేశామని, ఉత్సవాల నిర్వహణకు రూ. 10 లక్షలు ఖర్చు చేయాలని తీర్మానించారు. సమావేశంలో కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, రెవెన్యూ, జలమండలి, పురపాలక అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం



మాట్లాడుతున్న ఇన్‌చార్జీ నెల్లి శ్రీ వర్ధన్‌రెడ్డి

బండ్లగూడ: కేంద్రంలో మరోసారి మోదీ సర్కారు, తెలంగాణలో రానున్న ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారం సాధించడం ఖాయమని రాష్ట్ర నాయకులు బీజేపీ షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ నెల్లి శ్రీ వర్ధన్‌రెడ్డి అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు మహేష్ అధ్యక్షతన సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది యువకుల ఆత్మ బలిదానాలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కల్వకుంట్ల కుటుంబం స్కామ్‌లు, లీకేజీలతో ప్రజలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో గత తొమ్మిదేళ్లగా ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30 నుంచి దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో అందరు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో వివిధ రంగాలు, నిరుపేదలు, యువత కోసం చేపట్టిప అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఉద్యోగాలు రావాలంటే రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. మే 30 నుంచి జూన్ 30 వరకు జరిగే కార్యక్రమాలను సమష్టిగా విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి కమలం పువ్వు ప్రతి గడపకు మోదీ పథకాలు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దేపల్లి అశోక్‌గౌడ్, మహాలింగం గౌడ్, మల్లారెడ్డి, దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేష్‌యాదవ్, కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్, గోపిగౌడ్, శేఖర్‌ముదిరాజ్, నవీన్‌రెడ్డి, నర్సింగ్‌గౌడ్, మహిళా మోర్చా నాయకురాలు శ్రీలీల, నర్సింహ్మా, బీజేవైఎం ప్రధాన కార్యదర్శి అభినయ్, పవన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

కేపీఎల్ -2 క్రికెట్ పోటీల్లో బోరబండ జట్టు విజయం



కేపీఎల్ -2 విజయం సాధించిన బోరబండ జట్టు

శంషాబాద్: హైదరాబాద్ పాలమూరు కురువ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని తొండుపల్లి మైదానంలో జరిగిన కేపీఎల్–2 సీజన్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో బోరబండ జట్టు విజేతగా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో క్రాంతి వీర్, బోరబండ జట్టు మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో బోరబండ విజయం సాధించగా, క్రాంతి వీర్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. విజేత జట్టు కెప్టెన్ నవీన్ సింగ్ ట్రోఫీను అందుకున్నాడు. రన్నర్ ట్రోఫీని అశోక్‌కుమార్ కురువ అందుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెంకటేష్, హెచ్‌పీకేఎస్ వ్యవస్థాపకులు కె. శ్రీనివాస్, జట్రం కృష్ణ, రాము, జట్రం శ్రీనివాస్, రవికుమార్, అడికె అర్జున్, ఆనంద్, రాంచందర్, అశోక్, శ్రీను, రాము, రమేష్, నర్సింహ, ఐలయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



సమావేశంలో పాల్గొన్న నూతన కమిటీ సభ్యులు.

రాజేంద్రనగర్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటైంది. ఈ మేరకు సోమవారం ఇంద్రారెడ్డి మెమోరియల్ పార్కులో నిర్వహించిన భవానీ కాలనీ సొంత గృహాలు, ప్లాట్ల ఎస్సీ, ఎస్టీ యజమానుల సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా డాక్టర్ అమరేందర్, డాక్టర్ ఎస్.రమేష్, సి.బాల్‌రాజ్, అడ్వైజర్లుగా డాక్టర్ శంకరయ్య, కె.శంకర్, అసోసియేట్ అధ్యక్షులుగా గోల్కొండ యాదయ్య, కె.ఉమ్లానాయక్, ఉపాధ్యక్షులుగా కె.నారాయణ, సి.మోహన్‌బాబు, పి.పుల్యానాయక్, ప్రధాన కార్యదర్శిగా వేము వందనం, సంయుక్త కార్యదర్శులుగా ఎం.మోహన్, బి.శంకుస్వామి, కె.బాబునాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎస్.శంకర్, పి.ప్రేమ్, ఈశ్వర్, క్రీడాల కార్యదర్శిగా సి.హెచ్.రమాలక్ష్మిపతి, సంస్కృతిక కార్యదర్శిగా శోభారాణి, కోశాధికారులుగా టి.అశోక్‌కుమార్, కె.దేవుజా, ఎం.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎం.బి.నాయక్, ఎం.జయరామ్, బి.మాణిక్యం, జి.ముత్యాలు, ఎం.రాములు, జి.రాములునాయక్, ఎం.శివకుమార్, యాదమ్మ తదితరులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ రెండేళ్ల పాటు పదవిలో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ భవానీ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామన్నారు. అందరం ఒకటిగా ఉంటూ భవానీ కాలనీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

బండ్లగూడ: కాంగ్రెస్ పార్టీతోనే దేశం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఏ-బ్లాక్ అధ్యక్షులు డి.నవీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. గతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని, అధికారంలోకి వస్తే చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీని మరింత పతిష్టం చేసేందుకు పూర్తిస్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నూతన కమిటీ సభ్యులు వీరే..

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులుగా పూలపల్లి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా తలారి ప్రేమ్‌కుమార్, అద్నాన్ సదిక్, ప్రధాన కార్యదర్శిగా ఎన్.సుధాకర్, కార్యదర్శిగా బి.శ్రీనివాస్, కోశాధికారిగా ఎన్.శ్రావణ్‌కుమార్ , సభ్యులుగా ఎం.విష్ణు, కె.అంజయ్యయాదవ్, కె.బాల్‌రాజ్, ఎస్.రాంచందర్, పి.గోపాల్, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీసీ సెల్ అధ్యక్షులుగా ఏ.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సుదర్శన్‌ముదిరాజ్, రమేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా పి.ప్రకాష్, కె.సురేష్, సభ్యులుగా భాస్కర్, ప్రవీణ్, కార్పొరేషన్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా పోగాకు కుమార్, ఉపాధ్యక్షులుగా డి.మధుసూదన్, కందడ బాబురావు, ప్రధాన కార్యదర్శిగా గంగని రవికుమార్, కార్యదర్శిగా జి.జ్ఞానేశ్వర్, కోశాధికారిగా ఎం.ప్రసాద్, సభ్యులుగా బి.బాలకృష్ణ, కె.నరేష్, ఏ.భీమయ్య, కార్పొరేషన్ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా మహ్మద్ ఆయూబ్ ఖాన్, ఉపాధ్యక్షులుగా షేక్ మక్బూల్, షేక్ మదార్ ఆలీ, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఇషాక్, కార్యదర్శిగా మక్బూల్, కోశాధికారిగా షేక్ ఇమ్రాన్, సభ్యులుగా సయ్యద్ ముస్తఫా తదితరులను ఎన్నుకున్నారు.